www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024



పోలీసు మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా నగరి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల 19వ తేదీన అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ సి.సుబ్బారావు సతీమని సి.శ్రీజ్యోతికి సోమవారం ఐడిఆర్ఎఫ్ ఫండ్ నుండి రూ.1,00,000ల చెక్కును జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి చిత్తూరు పోలీస్ ఆఫీసులో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్పీ ఎస్ఐబి. శ్రీలక్ష్మి సమక్షంలో అందజేశారు. ఎస్పీ మృతుడి కుటుంబానికి భరోసా ఇస్తూ పోలీస్ డిపార్టుమెంటు తరపున వారి కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



అటవీ కార్మికుల సమస్య పరిష్కరించకుంటే... ఉద్యమం.. ఉధృతం..!

- దీక్షకు సిహెచ్ నర్సింగరావు సంఘీభావం
- జిల్లావ్యాప్తంగా సిఐటియు నిరసనలు



దీక్షా శిబిరం వద్ద మద్దతిస్తున్న మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ



ఐలు నాయకులు మురళి సంఘీభావం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

1160 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం చేయకపోవడం దారుణమని, జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లకు అన్యాయం చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఈ తప్పును టీటీడీ యాజమాన్యం సరిదిద్దుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేయడానికి తాము వెనుకాడేది లేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు హెచ్చరించారు. సోమవారం టిటిడి అటవీ కార్మికులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రసంగించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన కార్మిక వ్యతిరేకంగా తయారైందని, ధార్మిక సంస్థ టీటీడీలోనూ ఈ ధోరణులు పెరిగి పోయాయని విమర్శించారు. తిరుమల కొండ పచ్చదనానికి కారకులైన అటవీ కార్మికుల పట్ల టిటిడి యాజమాన్యం మొండివైఖరిని సమాజం యావత్తు ఏవగించుకునేటట్టు ఉందని గుర్తు చేశారు. 30 సంవత్సరాల పాటు సేవలందించిన అటవీ కార్మికుల్లో అత్యధికులు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే 12 మంది మరణించారని అయినా టీటీడీ యాజమాన్యానికి కనికరం కలగకపోవడం క్షంతవ్యం కాదని విమర్శించారు. తాజాగా అంగన్వాడీల పోరాటాన్ని నిర్వహించిన సిఐటియు దీనికి నాయకత్వం వహిస్తున్న విషయాన్ని టిటిడి యాజమాన్యం గుర్తుంచుకోవాలని అన్నారు. టీటీడీ బోర్డులో కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నం జరుగుతుందన్న విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి పై ఉందని, ఇటీవల కొన్ని సమస్యలు పరిష్కరించారని, దీర్ఘకాలంగా పోరాడుతున్న అటవీ కార్మికుల విషయం ఎందుకు పట్టించుకోవడం లేదని... దీనికి కుట్ర దారులు ఎవరైనా ఉన్నారా? ఈ కుట్రకు పాత్రధారులు, సూత్రధారులు ఎవరనే విషయం వెల్లడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఏర్పేడులో..

అఖిలపక్ష నేతల మద్దతు

ఆమరణ దీక్షా శిబిరం వద్దకు అఖిలపక్షం నేతలు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామ కృష్ణంరాజు, టిటిడి బోర్డు మాజీ సభ్యులు ఒవి రమణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, చిట్టిబాబు సంఘీభావం ప్రకటించారు. జూనియర్లను పర్మినెంట్‌చేసి, సీనియర్లను పక్కన పెట్టడం వెనుక పెద్ద కుంభకోణం జరిగి ఉంటుదని ఆరోపించారు. ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, బిఆర్ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ మద్దతు ప్రకటించారు.

మద్దతు ప్రకటించిన లాయర్లు


దీక్షా శిబిరానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాజులు, జిల్లా నేత పత్తికొండ మురళి, కె. నేతాజీ. చల్లా వెంకటయ్య, ప్రసన్న, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల సంఘీభావం

ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఇఎస్ కుమార్, జోనల్‌కార్యదర్శి భాస్కర్, ఎపి రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు మునిరత్నం, భాస్కర్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.హేమలత, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఇ.వెంకటరమణి, వై.కృష్ణకుమార్ సంఘీభావం ప్రకటించారు.

జిల్లా వ్యాప్తంగా నిరసనలు

తిరుపతిలో అటవీ కార్మికుల నిరవధిక దీక్షకు మద్దతుగా శ్రీకాళహస్తిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 2005, 2011లో టిటిడి యాజమాన్యం సూచన మేరకు సొసైటీలు



చిత్తూరు సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ప్రసంగిస్తూ..

ఏర్పరచుకున్న కార్మికులను కాదని, 2013లో చేరిన జూనియర్లను పర్మినెంట్‌చేయడం ఏంటని ప్రశ్నించారు. కెవిబిపురంలో మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు రాజేశ్వరి ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు, శివకవి ముకుంద ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గూడూరు సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు సురేష్, బివి రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, పామంజి మణి పాల్గొన్నారు. పుత్తూరులో సిఐటియు నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఏర్పేడులో సిఐటియు మండల నాయకులు కరీముల్లా, రంగయ్య ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. నాయకుల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, ఏమైనా జరిగితే చూస్తూ ఊరుకోబమని, టిటిడి యాజమాన్యం స్పందించి సమస్యను సానుకూలంగా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



నాయుడుపేటలో..

ఫారెస్టు కార్మికుల సమస్యను పరిష్కరిస్తాం

టిటిడి ఛైర్మన్ భూమన హామీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న ఫారెస్టు కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం అన్నమయ్య భవన్‌లో పాలకమండలి సమావేశం కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. రూ.5.141.74 కోట్ల టిటిడి వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వివరించారు. అనంతరం విలేకరులు అటవీ కార్మికుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. టిటిడి ఫారెస్టు కార్మికుల సమస్యను మానవతా దృక్పథంతో ఆలోచిస్తున్నామని, వారి సమస్య పరిష్కారానికి ముగ్గురు టిటిడి ఉన్నతాధికారులతో హైలెవల్ కమిటీని నియమించినట్లు చెప్పారు. మంగళవారం ఫారెస్టు కార్మికులతో, యూనియన్ నాయకులతో సంప్రదించి, వారి డిమాండ్లను కమిటీ సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయబద్ధంగా సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ సమావేశంలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి ఉన్నారు.

ఎఫ్‌ఎంఎస్ కార్మికుల విజయం

కొత్త నిబంధనలు రద్దు చేస్తూ బోర్డు నిర్ణయం
ఆందోళన విరమణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టిటిడి ఎఫ్‌ఎంఎస్ కార్మికుల పోరాటానికి యాజమాన్యం దిగివచ్చింది. హెల్త్ టెండర్ల కొత్త నిబంధనలను రద్దు చేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. దీంతో కార్మికులు ఆందోళనను విరమించారు. సిఐటియు ఆధ్వర్యంలో ఎఫ్‌ఎంఎస్ కార్మికులు రెండు రోజులుగా టిటిడి పరిపాలనా భవనం వద్ద ఆందోళన చేస్తున్న విషయం విదితమే. సోమవారం జరిగిన టిటిడి పాలకమండలి సమావేశంలో హెల్త్ టెండర్ల కొత్త నిబంధనలను ఉపసంహరిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. బోర్డు నిర్ణయాన్ని స్వాగతిస్తూ సోమవారం సాయంత్రం కార్మికులు ఆందోళనను విరమించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు టి.సుబ్రమణ్యం వెల్లడించారు. సోమవారం ఉదయం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు వీరి శిబిరం వద్దకు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు.41 ఏళ్లు పైబడిన వారు వద్దని, 30శాతం మహిళలు, 70 శాతం పురుషులు ఉండాలని, సూపర్‌వైజర్లకు శానిటరీ సర్టిఫికేట్ ఉండాలని తాజా టెండర్లలో టిటిడి నిబంధనలు సరికాదన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, టిటిడి ఉద్యోగ సంఘం మాజీ నాయకులు మునిరాజా, నాయకులు వేణుగోపాల్, బుజ్జమ్మ, ఎఫ్‌ఎంఎస్ సంఘం నాయకులు త్యాగ, రఘు, రవి,పార్థసారథి పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సిహెచ్ నర్సింగరావు

రూ.5,141.74 కోట్లతో టిటిడి వార్షిక బడ్జెట్

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంపు
- స్విమ్స్‌లో 1500 పడకల పెంపుకు ఆమోదం
- ధర్మప్రచారంలో భాగంగా మహిళలకు మంగళసూత్రాలు
- టిటిడి అనుబంధ ఆలయాల్లో పోస్టుల భర్తీ
- టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,141.74 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్టు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. ఛైర్మన్ అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. భూమన కరుణాకర్‌రెడ్డి నిర్ణయాలను వెల్లడిస్తూ మతమార్పిడి జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు ధర్మప్రచారంలో భాగంగా బంగారు మంగళసూత్రాలు 5 గ్రాములు, 10 గ్రాముల్లో తయారు చేసి నాలుగైదు డిజైన్లలో విక్రయించనున్నట్లు తెలిపారు. లక్ష్మీకాసులను తయారు చేసి ఎలాంటి లాభాపేక్ష లేకుండా విక్రయిస్తామన్నారు. మహిళలకు ఇది స్వామివారి కానుకని అన్నారు.



- టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద అదనంగా కేటాయించిన 132.05 ఎకరాల స్థలంలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు టెండరు ఆమోదం.
- టీటీడీ పోటు విభాగంలోని 70 మంది కాంట్రాక్టు లడ్డూ ట్రే లిఫ్టింగ్ సెమి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా మార్పు చేసి వారి వేతనాలను రూ.12,523 నుండి రూ.15 వేలకు పెంచేందుకు ఆమోదం.
- అన్నదాన విభాగంలో 138 మంది క్లీనర్లు, 79 మంది వంట మనుషులను స్కిల్డ్ కేటగిరీలోకి మార్చి వారి వేతనాలను రూ.17 వేల నుండి రూ.22 వేలకు పెంపు.
- ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేసే కార్మికులను అన్‌స్కిల్డ్ నుండి స్కిల్డ్ కేటగిరీలోకి మార్పు.
- శ్రీ వెంకటేశ్వర శిల్ప కళాశాలలో వివిధ దేవతామూర్తుల శిల్పాలను తయారుచేస్తున్న శిల్పుల కళానైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా, వారి వేతనాల పెంపుదలకు ఆమోదం.
- కలంకారి కళలో నిపుణులైన మునస్వామిరెడ్డి వేతనం రూ.25 వేల నుండి రూ.39 వేలకు పెంపు.
- టీటీడీ అనుబంధ, విలీన ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అర్చకులు, సంభావన అర్చకుల వేతనాలను రూ.26 వేల నుండి రూ.31 వేలకు పెంచేందుకు ఆమోదం.
- టీటీడీ స్టోర్‌లో పనిచేసే 9 మంది వర్కర్లకు వారి వేతనం రూ.9 వేల నుండి రూ.15 వేలకు పెంచడం జరిగింది.
- ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ద్వారా సేవలందిస్తున్న క్రమాపాఠీలకు రూ.16 వేల నుండి రూ.22 వేలకు, ఘనాపాఠీలకు రూ.17 వేల నుండి రూ.25 వేలకు సంభావన పెంపు. 1400 మంది వేదపారాయణదారులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ రూ.10 వేల నుండి రూ.12 వేలకు పెంపు. టీటీడీ ఆధ్వర్యంలోని ఆరు వేద పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 51 మంది సంభావన అధ్యాపకుల వేతనాలను రూ.35 వేల నుండి రూ.54 వేలకు పెంచేందుకు ఆమోదం.
- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 26 స్థానికాలయాలు, విలీనం చేసుకున్న 34 ఆలయాల్లో 227 వేదపారాయణందారు, అధ్యాపక, మేళం సిబ్బంది పోస్టులు, టీటీడీ విలీనం చేసుకున్న ఆలయాల్లో 288 అర్చక, పరిచారిక, పోటు వర్కర్, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్, వేదపారాయణందారు, మేళం సిబ్బంది పోస్టులు ఉన్నాయి.
- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న 300 పడకలను 1200 పడకలకు పెంచుతున్నాం. అదేవిధంగా 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఆసుపత్రి భవనాలను పెరుగుతున్న రోగుల అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించేందుకు రూ.148 కోట్లతో టెండరు ఆమోదం.
- తిరుమలలోని ఆకాశగంగ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివద్ధి చేసేందుకు రూ.30.71 కోట్లతో టెండరు ఆమోదం.
- రూ.2.28 కోట్లతో సప్తగిరి సత్రాలు-6, 7 బ్లాకుల అభివృద్ధి పనుల కోసం టెండరు ఆమోదం.
- తిరుమలలోని శ్రీవేంకటేశ్వర, ఆదిశేషు, శంకుమిట్ట విశ్రాంతి గహాల అభివద్ధి, పెయింటింగ్ పనుల కోసం రూ.10.90 కోట్లు మంజూరుకు పరిపాలన అనుమతికి ఆమోదం.
- ఆకాశరాజు నిర్మించిన అతిప్రాచీనమైన నారాయణవనంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ఆలయానికి రాజగోపురం, రాతిప్రాకారం నిర్మాణానికి రూ.6.90 కోట్లు మంజూరుకు ఆమోదం.
- శ్రీవారి పాదాల చెంత ఉన్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఇకపై శ్రీ పద్మావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌గా రూపుదిద్దుకోనుంది.
- సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఐదేళ్ల కాలపరిమితికి గాను ఓరాకిల్ ఫ్యూజన్ క్లౌడ్ ఇఆర్‌పి ప్రవేశపెట్టేందుకు ఆమోదం.
- తిరుమల అన్నమయ్య భవనం సమావేశ మందిరం ఆధునీకరణలో భాగంగా దృశ్యశ్రవణ అనుసంధాన పరికరాల ఏర్పాటుకు ఆమోదం.
- ఫిబ్రవరి 3-5 తేదీల్లో తిరుమల ఆస్థాన మండపంలో 57 మంది పీఠాధిపతులతో ధార్మిక సదస్సు జరగనుంది.

ఈ సమావేశంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

'స్పందన'కు 277 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలోమొత్తం 277 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 243, జిల్లా విద్యాశాఖ 4, పోలీసు శాఖ 2, ఆర్‌డబ్ల్యుఎస్ 1, మున్సిపల్ శాఖ 5, డిఆర్‌డిఏ 9, జిల్లా ఉపాధి కల్పన 2, డ్వామా 1, ఏపిఎస్‌పిడిసిఎల్ 2, జిల్లా పరిషత్ 3, డిసిహెచ్ఎస్ 2, హౌసింగ్ 1, సోషల్ వెల్ఫేర్ 1, ఇతరులు 1 మొత్తం 277 అర్జీలను వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు డిఆర్‌ఓకు అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఓ ఎన్.రాజశేఖర్

ప్రజాసమస్యలకు పరిష్కార వేదికగా 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి రిషాంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్‌పి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్‌ని, ఎస్ఐబి. అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరిత గతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 25 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు ఇలా ఉన్నాయి. చీటింగ్ 1, ఇంటి తగాదాలు 3, భర్త వేధింపులు 1, భూ తగాదాలు 4, ఆస్తి తగాదాలు 4, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 6, దారి తగాదాలు 3 ఉన్నాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి

'స్పందన'కు ఆరు వినతులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ గోవర్ధన్ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా 2, ప్రజారోగ్య విభాగం 3, ఇంజనీరింగ్ 1 చొప్పున మొత్తం ఆరు వినతులు అందాయి. ఈ వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, డీఈ రమణ, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్షుణ్ణంగా ఓటర్ల జాబితా పరిశీలన : ఈఆర్వో చిన్నయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలింగ్ బూత్ స్థాయిలో తుది ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పొరపాట్లు ఉంటే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య బిఎల్వోలు, సూపర్వైజర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నియోజకవర్గంలోని బిఎల్వోలు, సూపర్వైజర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ఇటీవల ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ఉన్నా, పోలింగ్ బూత్ నెంబర్లు మారి ఉన్నా, ఫోటోలు సక్రమంగా లేకపోయినా, డబుల్ ఎంట్రీలు, జంక్ ఓటర్లను గుర్తించి సత్వరం నివేదిక ఇవ్వాలన్నారు. గుర్తించిన పొరబాట్లను నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తిచేసి అందించాలన్నారు. జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం ఉన్నందున దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

వంద శాతం కుల గణన సర్వే...

నగరపాలక పరిధిలో కులగణన సర్వేను వందశాతం పూర్తిచేయాలని సహాయ కమిషనర్ గోవర్ధన్ చెప్పారు. కులగణన, పేదలందరికీ ఇల్లు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, టాక్స్ వసూళ్లపై అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలో కుల గణన సర్వే వేగంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పన్నుల వసూలు వేగవంతం చేయాలని, దీర్ఘకాలికంగా ఉన్న బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సీఎంఎం గోపి, సూపర్వైజర్ అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలంది రాజకీయ ఆత్మహత్య

మీడియాతో మంత్రులు ఆర్కే రోజా, పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాలుగో కష్టుడిగా కాంగ్రెస్ పార్టీలోకి వైఎస్ షర్మిల ప్రవేశించారని రాష్ట్ర మంత్రులు ఆర్కే రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. తిరుపతిలోని ఓ హెూటల్లో సోమవారం మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి కుమార్తెగా షర్మిలాను అభిమానులు గౌరవిస్తారని, కానీ కుటుంబాన్ని చీల్చిన పార్టీతో, రాష్ట్ర విభజనతో ఆంధ్ర ప్రదేశ్ ను అధోగతి పాలుచేసిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరడం శోచనీయమన్నారు. తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరును ఎఫ్ఐఆర్ లో చేర్చిన కాంగ్రెస్ పార్టీతో వైయస్ షర్మిల జతకట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ చంద్రబాబు కుయుక్తులు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంతా తెలుసన్నారు. తనకు మళ్ళీ ఛాన్స్ కావాలని ప్రజల్లోకి వస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం రాజకీయంగా తనకు అన్ని విధాలా సహకరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ, వైఎస్ఆర్సి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ తనకు తానే రాజకీయ ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాబోవు ఎన్నికల వైఎస్ఆర్సిపి క్లీన్ స్వీప్ చేస్తుందని, జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సమ్మెలో సర్ఫ్ ఉద్యోగులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఏ)లో పనిచేస్తున్న ఏపీఎంలు, సీసీలు, డీఎంపీలు, ఏరియా కోఆర్డినేటర్లు సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వైయస్సార్ కాంతి పథకం ఉద్యోగుల సంఘం నాయకులు (సర్ఫ్) హరినాథ్, ప్రభాకర్, సుధాకర్, రజనీలు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్ఫ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, టైమ్స్ స్కేల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళనకు పూనుకోవాల్సి వచ్చిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాక సంఘాల మహిళలకు సహాయ సహకారాలు అందిస్తూ విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వైయస్సార్ క్రాంతి పథకం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేపట్టిన సర్ఫ్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ విశ్రాంతి ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు నాగరాజు, శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, పిఆర్సి అరియర్స్ చెల్లించాలని, డిఆర్ఎస్ 70 సంవత్సరాల పైబడిన వారికి పది శాతం నుండి ఏడు శాతానికి తగ్గించడం, అలాగే 75 సంవత్సరాల పైబడిన వారికి 15 నుండి 12 శాతానికి అదనపు పెన్షన్ తగ్గించడం తగదని అన్నారు. మెడికల్ రియింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించకపోవడం వంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైయస్సార్ ప్రభుత్వం పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలం చెందిందన్నారు. ధర్నాలు వివిధ శాఖలకు చెందిన విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విశ్రాంతి ఉద్యోగులు

టౌన్ ప్లాన్ అధికారిగా వి.శారద



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలిక సంస్థ టిపిఓగా వి.శారద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎర్రగుంట పంచాయతీలో టిపిఓగా పనిచేస్తున్న శారద బదిలీపై చిత్తూరు నగరపాలక సంస్థకు వచ్చారు. అనంతరం ఆమె నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ అరుణ, సహాయ కమిషనర్ గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కానరాని పూతలు.. రైతులంతా దిగులు...



- పంట దిగుబడిపై రైతన్న ఆందోళన
- పూత కనిపించడం లేదని దిగులు
- పెట్టుబడి కూడా వస్తుందో లేదోనని నిరాశ
- తోటల కొనుగోలుకు వ్యాపారుల అనాసక్తత

ప్రజాశక్తి-వెదురుకుప్పం

చలి తీవ్రత, పొగమంచు వాతావరణంలో మార్పులు, అధిక వర్షంతో మామిడిలో పూత కరువైనట్లు తెలుస్తోంది. ఏడాధికోసారి ప్రధాన ఫలసాయంగా రైతులు మామిడిపైనే ఆసక్తి చూపుతుంటారు. అయితే అశించిన మేరకు పూత రాకపోవడం, తోటల కొననుగోలుకు వ్యాపారస్తులు ముందుకు రాకపోవడం, పెట్టుబడులు పెరిగిపోవడం, ఆశించిన మేరా దిగుబడి వస్తుందో రాదోనని రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

పూత ఆలస్యమవుతుండటంతో ఆందోళన

సాధారణంగా ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లోని పూత ఆరభమై జనవరిలో పిందె దశలో ఉండేది. అయితే చాలా వరకూ ఇప్పటికీ మామిడిలో పూత రాలేదు. అధికంగా ఇగురులు ఉండడంతో చెట్లు పూత రాక వెలవెలబోతున్నాయి. ఏటా మామిడి ఫలసాంపై ఆశలు పెట్టుకున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ృఅధిక దరలతో పెట్టుబడులు పెరిగి దిగుబడినే నమ్ముకున్న మామిడి రైతులు నిరాశ పడుతున్నారు. సాధారణంగా ఇప్పటికే వ్యాపారస్తులు తోటలు కొనుగోలు చేసేవారు. అయితే పూత లేకపోవడంతో కొనగోలుకు మొగ్గుచూపడం లేదని రైతులు ఒకింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి దిగుబడిపైనే ఆధారపడి..

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీల్లో అధికంగా రైతులు చెరకు, మామిడి పంటలపైనే ఆధారపడి ఉన్నారు. నల్ల బెల్లంపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో చెరకు తోటలను వదులుకున్నారు. మండలంలో 1600హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఏడాధికోసారి వచ్చే మామిడి దిగుబడికోసం రైతులు ఈ దఫా ఆశలు పెట్టుకున్నారు. కాగా ఆశించిన మేరా పూత రాకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

చిరు ప్రయత్నంగా మందులు పిచికారి..

పూత రాకపోవడంతో రైతులు మందులు కొనుగోలు చేసి తోటలకు పిచికారి చేస్తున్నారు. చిరు ప్రయత్నంగా అప్పులు చేసి మందులు స్ప్రే చేయిస్తున్న రైతులు వాపోతున్నారు. పూత వస్తే తప్ప ఈ ఏడాధి పెట్టిన పెట్టుబడికి కూడా దిగుబడి చేతికందే పరిస్థితి లేదని రైతులు చెబుతున్న మాట.

కనీసం పెట్టుబడి వస్తుందో రాదో..



గత ఏడాధి కంటే ఈ ఏడాధి వర్షాలు డిసెంబర్ నెలలో కురిసాయి. వచ్చే పంటకూడా మగ్గిపోయింది. పిచికారి చేస్తే పూత వస్తుంది. ఆ తరువాత పూత నిలుస్తుందో లేదో.. ఈ సారి పెట్టిన పెట్టుబడి చేతికందితే గగనమే.

పందికుంట సుబ్రమణ్యం రెడ్డి, మామిడి రైతు, వెదురుకుప్పం

పూత పూర్తిగా రాలేదు..



నాకు ఐదు ఎకరాల మామిడితోట ఉంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ దఫా ఇప్పటి వరకూ పూత రాలేదు. ఖర్చు చేసి మందులు కొట్టడం ఎందుకని వదిలేశాం. పక్క తోటల్లో రైతులూ ఇదే పరిస్థితి. మామిడి రైతులకు ఈ సారి కష్టాలే.

అత్తూరు కుప్పారెడ్డి, మామిడి రైతు, కోదండరామాపురం

వైద్యురాలికి వ్యతిరేకంగా ఆస్పత్రి వద్ద నిరసన

- ఆమె చేసిన ఆపరేషన్‌లో పొరపాటు జరిగిందంటూ ఆగ్రహం

ప్రజాశక్తి-నగరి: నగరి ఏరియా ఆస్పత్రిలోని ఒక వైద్యురాలికి వ్యతిరేకంగా గుండ్రాజుకుప్పం దళితవాడకు చెందిన వారు నిరసన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ ఆసుపత్రిలో డెలివరీ నిమిత్తం వన్మతి అనే మహిళకు డెలివరీ నిమిత్తం ఆపరేషన్ జరిగిందని ఆపై ఆమె ఆరోగ్యానికి సంబంధిత పలు సమస్యలు ఎదురయ్యాయని ఆరోపణలు చేశారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయని ఆమె వద్దకు విచ్చేసినా ఆమె స్పందించలేదన్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకున్నారు. వైద్యురాలు చేసిన ఆపరేషన్‌లో పొరపాటు జరిగిందన్న కోపంతో బాధితులు, వారి అనుచర వర్గాలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. తమకు న్యాయం చెయ్యాలంటూ ధర్నా చేశారు. సూపరింటెండెంట్ ప్రభావతి నిరసన కారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా కూడా ఈ విషయమై డీఎండీవోకు ఫిర్యాదు చేయడంతో ఎంక్వయిరీకమిటీ విచారిస్తోందన్నారు. కమిటీ నిజానిజాలు తేలుస్తుందని. తప్పు జరిగి ఉంటే తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తనకు ఇప్పటివరకు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని జరిగిన విషయాలు తెలుపుతూ ఆధారాలు తనకు అందించాలన్నారు. సంబంధిత వైద్యులు బయటకు వచ్చి సమాధానం చెప్పాలంటూ బాధితులు కోరడంతో ఎంక్వయిరీలో ఉన్న వైద్యులు అలా రాకూడదని సూపరింటెండెట్ సమాధానమిచ్చారు. దీనిపై సంతృప్తి చెందని వారు తిరుపతి చెన్నై రహదారి రోడ్డుపై కూర్చొని ధర్నా చేశారు. సీఐ సురేష్ సిబ్బంది వచ్చి జాతీయ రహదారిపై కూర్చోరాదని సమస్యను ఆస్పత్రిలో తేల్చుకోవాలని చెప్పడంతో బాధితులు గంట పాటు ఆస్పత్రి రోడ్డుపై నిరసన వ్యక్తం చేసి వెనుదిరిగారు.



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

నిస్వార్థ సేవలకు అవార్డులు

ప్రజాశక్తి-పుంగనూరు: పట్టణంలో తమ వీధులలో ప్రజా సేవలే కర్తవ్యంగా భావించి నిస్వార్థసేవలు అందించిన వారిని గుర్తించి మతసామరస్యం పరమత సహనం అవార్డులు అందిస్తున్నట్లు అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ చెప్పారు. స్థానిక బసవరాజ బాలికల కళాశాల ఆవరణంలో డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామారస్యం-పరమత సహనం ప్రతి ఒక్కరు పాటించాలని డాక్టర్ అబ్దుల్ కలామ్ అడుగుజాడల్లో నడవడానికి సభ్యులతో కలసి ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ముఖ్యంగా పుంగనూరులో డాక్టర్ అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటు చేయనున్నామని అందుకు అనుమతులు కోరుతూ సంబంధిత తహశీల్దార్ సీతారామ్, మున్సిపల్ కమిషనర్ నరసింహా ప్రసాద్‌కు విన్నవించామన్నారు. విగ్రహ ఏర్పాటుకు త్వరలోనే స్థల పరిశీలన చేసిన అనంతరం అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. వివిధ రంగాలకు చెందిన సుమారు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ కలామ్ వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభని చాటిన విద్యార్థినిలకు ప్రముఖులు, అవార్డు గ్రహీతలు, అబ్దుల్ కలామ్ ట్రస్ట్ సభ్యులు అవార్డులు ప్రదానం చేసారు. కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, తహశీల్దార్ సీతారాం, విశ్రాంత డిఎస్పి సుకుమార్, అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు, లైన్స్‌క్లబ్ అధ్యక్షులు త్రిమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కమలాకర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

నేడు 'వైఎస్సార్ ఆసరా' చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: 4వ విడత వైఎస్సార్ ఆసరా నిధులకు సంబంధించిన చెక్కును పంపిణీ చేయనున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంఎడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించిన లబ్ధిదారులకు చెక్కును అందిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఎస్టీయూ ఎన్నికల్లో నగరికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-నగరి:

జిల్లా ఎస్టీయూ కార్యవర్గ ఎన్నికల్లో నగరి మండలానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యవర్గంలో రాష్ట్ర కౌన్సిలర్లుగా సుబ్రమణ్యం, నాగభూషణం ఎన్నికైనట్లు తెలిపారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా మునెప్పనాయుడు, పవన్‌కుమార్‌రెడి, నగరి డివిజనల్ కన్వీనర్‌గా గిరిబాబు, గంగామోహన్, మహేంద్రన్, మైనారిటీ కమిటీ సభ్యుడిగా ఆర్.సి.జి.గణేశన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులుగా మధన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-యాదమరి:



మధన్‌మోహన్ రెడ్డి

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా ఎన్ఆర్ మధన్‌మోహన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు కౌన్సిల్ సమావేశం కత్తి నరసింహా రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు గంటామోహన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్‌టియు యూనియన్ సంఘం ఎన్నికలలో యాదమరి మండలం కె.గొల్లపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు మదన్ మోహన్ రెడ్డి , ఎస్ టి యు చిత్తూరు జిల్లాశాఖ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా యాదమరి ఎస్‌టియు డలశాఖ అధ్యక్షులు గుణశేఖరన్, ప్రదాన కార్యదర్శి రమేష్, సంఘ నాయకులు బాషా, సుబ్రమణ్యంపిల్లె, రంగనాదం, మణిరెడ్డి, గణపతి,గోవింద స్వామి, మురళీధర్ రెడ్డి, తులసీరాం, జయచంద్ర, చిన్నదొరై మహిళా కన్వీనర్‌లు లోహిత, ఉమ, ప్రమీల కుమారి, గౌరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదిమూలం తిన్నింటి వాసాలు

లెక్కించడం సరికాదు: రాజేష్

ప్రజాశక్తి-వెదురుకుప్పం:

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిన్నింటి వాసాలు లెక్కించడం సరికాదని వైసీపీ నాయకులు నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఆదిమూలం మీడియా ఎదుట మంత్రి పెద్దిరెడ్డిపై చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. మంత్రిపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని సూచించారు.

ఆహ్లాదాన్ని అందించేందుకే పార్కు: రోజా

- నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి మంత్రి

ప్రజాశక్తి-నగరి: వినోదంతో కూడిన ఆనందాన్ని ప్రజలకు అందించేందుకే మున్సిపాలిటీల్లో పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం నగరి మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న పార్కును ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, వృత్తి రీత్యా ఒత్తిల్లకు గురైన వారు, వయో వృద్దాప్యంలో ఆహ్లాదకరమైన ప్రాంతంలో సేదతీరాలనుకున్నవారు పార్కు కోసం ఎదురు చూస్తారన్నారు. పార్కులు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పట్టణ ప్రమాణాలను పెంచుతుందన్నారు. రూ.1.10కోట్ల వ్యయంతో పుత్తూరులో మున్సిపల్ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు రూ.24లక్షల వ్యయంతో చిల్డ్రన్ పార్కుకు ప్రహరీగోడ నిర్మిస్తున్నామన్నారు. రూ.39.5లక్షల వ్యయంతో వడమాలపేటలో తుడాపార్కు ప్రారంభించడం జరిగిందన్నారు. నగరిలో రూ.80లక్షల నిధులతో పార్కును ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇప్పటికే పార్కుకు సంబందిత ప్రహరీ, ఆర్చి పనులు పూర్తయ్యాయని, పార్కులో నీటివసతి బోరువేయడం జరిగిందన్నారు. త్వరలో మిగిలిన పనులు పూర్తవుతుందన్నారు. పరిశీలనలో ఆమె వెంట తుడా వైస్‌చైర్మన్ హరికృష్ణ, డీఈలు కృష్ణారెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



పార్కు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి రోజా

'అనాధలను అక్కున చేర్చుకోవాలి'



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం

అనాధలను అక్కున చేర్చుకోవాలని తిరుపతి ముస్లిం జేఏసీ అధ్యక్షులు షేక్ ఇమామ్ సాహెబ్ అన్నారు. సోమవారం మండలంలోని ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ముస్లిం జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అనాధలను గుర్తించాలని అదేవిధంగా వారిని పరిశుభ్రంగా తయారు చేసేందుకు విధులు చేపట్టాలని వారికి అవసరమైన ఆహారాన్ని బట్టలను అందించి వారిని అక్కున చేర్చుకోవాలన్నారు కోవిడ్ వ్యాపించే ఉన్నదని దానిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బిపిఎం ముస్లిం జేఏసీ గౌరవ అధ్యక్షులు రఫీక్ హజరత్, ఉపాధ్యక్షులు లాలు, కార్యదర్శి జిలాన్ బాషా, కోశాధికారి సంషీర్, ముస్లిం జేఏసీ సభ్యులు హీద్దు, రియాజ్ బాషా, సూహెల్, దావూద్ భాయ్, టైలర్ బాబా, రసూల్, ముజంమిల్ పాల్గొన్నారు.

'బాలబాలికలను జువైల్ హోమ్స్‌కి పంపాలి'

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

18 సంవత్సరాల లోపు బాల బాలికలు చట్టంతో విబేధించడం (నేరస్తులను) వారిని సాధారణ జైల్‌లో పెట్టారాదని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు న్యాయసదన్ భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు, జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ఉత్తర్వులు మేరకు 18 సంవత్సరం లోపు బాల బాలికలు చట్టంతో విభేదించి వారిని జైల్లో పెట్టడం వల్ల బాలబాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కును ఉల్లంఘించి వారమవుతామని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాల లోపు క్రౌమార దశలో ఉన్న బాలబాలికల జైల్లలో ఉన్నారని గుర్తించవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

మోటార్, స్టార్టర్ చోరీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: గడ్డివామిని తగలబెట్టి, బోరు మోటారు, స్టార్టర్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మండలంలోని గొల్ల చీమలపల్లి పంచాయతీ పరిధిలోని గడ్డిండ్లు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు రమనప్ప కథనం మేరకు.. పాడి ఆవుల కోసం ఏర్పాటు చేసిన గడ్డివామికి నిప్పంటించి, అక్కడి ఉన్న విద్యుత్ స్టార్టర్, మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు.

ఆటల్లో మేటి.. మీకెవరు సాటి

- విజేతలకు బహుమతులు ప్రదానం


ప్రజాశక్తి-వెదురుకుప్పం:

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ బహుమతులు సాధిస్తున్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు అవలీలగా చేరుకుంటున్నారు. సోమవారం నియోజకవర్గ స్థాయిలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మండలంలోని మొండివెంగనపల్లి పంచాయతీ సర్పంచ్ పోటుగారి లలితభాస్కర్ కుమారై మోహిత ద్వితీయ బహుమతిని అందుకుంది. మోహితను పలువురు అభినందించారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ పోటీల్లో మండలం తరపున క్రీడాకారుడు రాజా ప్రథమ స్థానంలో బహుమతులు అందుకున్నారు.

గంగాధరనెల్లూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో విజేతలకు అధికారులు సోమవారం బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీదేవి, వైస్ ఎంపీపీ హరిబాబు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం సంతోష కరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సుధాకర్, మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులుశెట్టి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేలు మొదలి, నాయకులు మునిరాజరెడ్డి, గోవిందరెడ్డి, హేమశేఖర్ రెడ్డి, కేశవులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం: బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు



గంగాధరనెల్లూరు: బహుమతులు అందుకుంటున్న యువకులు

నగరి: ఆడుదాం ఆంధ్ర పోటీలలో విజేతలకు మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం నియోజకవర్గ స్థాయి విజేతలకు బహుమతులను క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, పీడీ గోపి, సురేష్, అంపైర్లు చంద్ర, పాండియన్, విజయ్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మనోహర్ నాయుడు మృతికి పలువురి నివాళి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం: రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడు ఆదివారం సాయంత్రం చికిత్స పొందుతూ మరణించారు. పాచిగుంట గ్రామంలో మనోహర్‌నాయుడు భౌతిక కాయానికి టిడిపి, వైసిపి, బిజెపి, కాంగ్రెస్, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, డాక్టర్ థామస్, గాలి భానుప్రకాష్, మురళి మోహన్, జ్ఞానేంద్రరెడ్డి, విజయనంద రెడ్డి, గాంధీ, బాబురెడ్డి, గుణశేఖర్, రాజేష్, పొన్న యుగంధర్ తదితరులు నివాళులర్పించారు.

పైప్‌లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు పంచాయతీ పోస్ట్ ఆఫీస్ వీధిలో నూతనంగా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బాషా మసూద్ తెలిపారు. కలికిరి-సోమల ప్రధాన రహదారి కందూరు గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న కారణంగా గతంలో వేసిన త్రాగునీటి పైపులు పగిలిపోవడంతో ఆ స్థానంలో నూతన లైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పనులను పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పర్యవేక్షిస్తున్నారు.



ఏర్పాటు చేస్తున్న పైపులైన్లు

రోగులకు మెరుగైన సేవలు అందించండి: ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటనగరం: రోగులకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ ఆశయాలు ప్రజల్లో స్థిరస్థాయిగా నిలిచి పోయేయాల చూడాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చిన్ననగర్ వీధిలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యకేంద్రం నిర్వాహణకు పెద్దపీట వేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్వేటినగరం మండలంలో కమ్యునిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గ్రామస్థాయిలో విలేజ్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి భవాని, ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీడీవో మోహన్‌మురళి, డాక్టర్ గోపినాథ్, డాక్టర్ హేమశ్రీ, డాక్టర్ యూసాప్ ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, మణి, అంబరిష్రరాజు, త్యాగరాజు, సుమతి పాల్గొన్నారు.



ఆరోగ్య మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

గుడిపల్లి వైసీపీ కో కన్వీనర్‌గా హరినాథ్ రెడ్డి

ప్రజాశక్తి-గుడిపల్లి: మండల వైసీపీ కో కన్వీనర్‌గా హరినాథ్‌రెడ్డి నియమితులైయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డప్ప, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్‌కి కృతఘ్నుతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



హరినాథరెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్థానిక ఇరువారంలో మాజీ కార్పొరేటర్ రాజేశ్వరితో పాటు 50మంది వైసీపీ నుండి టిడిపిలో చేరారు. టీడీపీలో చేరిన వారిని జిజేఎం ట్రస్ట్ అధినేత తెలుగుదేశం సీనియర్ నాయకులు గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ కార్పొరేటర్ అశోక్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. అనేక మంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తెలిపారు.



టీడీపీలో చేరుతున్న నాయకలు

మండల ప్రధాన కార్యదర్శిగా అజయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రామకుప్పం: వైసీపీ రామకుప్పం మండల యువత ప్రధాన కార్యదర్శిగా రాజుపేట పంచాయతీకి చెందిన అజయ్‌కుమార్ రెడ్డికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై బాధ్యత అప్పగించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీలు రెడ్డప్ప, మిధున్‌రెడ్డి ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పిటిసి నితిన్‌రెడ్డి, కన్వీనర్ బాబురెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డప్ప, సుబ్రహ్మణ్యం, నితిన్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ

ఇంటింటికీ ట్యాప్ కనెక్షన్: ఎఈ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ప్రతి ఇంటికీ ట్యాప్ కనెక్షన్ ఇప్పించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా పనులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అనూష అన్నారు. సోమవారం వెలుగు కార్యా లయంలో స్వయం సహాయక సంఘాలలోని మహిళా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించేందుకు ప్రభుత్వమే నాణ్యమైన మెటీ రియల్ సరఫరా చేస్తుందని, ప్రభుత్వం సరఫరా చేసిన మెటీ రియల్‌ని సద్వినియోగం చేసే విధంగా కమిటీలు పర్యవేక్షిం చాలని, చెక్కులలో సంతకాలు పెట్టేటప్పుడు తీర్మానాలు వ్రాసుకో వాలని, తీర్మానాలు లేకుండా చెక్కులు రాయకూడదని తెలిపారు.

'హమాలీల సంక్షేమ బోర్డుపై మ్యానిఫెస్టో ప్రకటించాలి'

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు ఎస్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.డి.రవి పాల్గొని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సంక్షేమ బోర్డు ఏర్పాటుకు మ్యానిఫెస్టో ప్రకటించిన పార్టీలకే మద్దతు ఉంటుందన్నారు. ప్రధాన డిమాండ్‌లపై ఫిబ్రవరి 12న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం సమర్పించాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నేత మృతికి నివాళి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని కెంచనబల్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత గంగప్ప అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం తెదేపా నేతలు, కార్యకర్తలు ఆయన భౌతికకానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ తరపున రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మునిరత్నం, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నారాయణచారి, రామలింగారెడ్డి, చంద్రారెడ్డి, గోవిందప్పలు ఉన్నారు.

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్టు టిడిపి పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మురళీమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని తుంబపాలెం గ్రామంలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం సర్పంచ్ ఉషశ్రీ ఆధ్వర్యంలో జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోదండయాదవ్, గురుస్వామియాదవ్, గోవిందు, నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో మురళిమోహన్